

కన్నోళ్లకు కడుపుకోత
పాములపహాడ్‌లో పిడుగు పడి ఓ యువకుడు మృతిచెందడంతో అతడి తల్లిదండ్రుల రోదన కంటతడి పెట్టిస్తోంది.
- 10లో



జేఎన్‌వీ ఫలితాలు వెల్లడి
చలకుర్తిలోని జవహర్ నవోదయ విద్యాలయం (జేఎన్‌వీ)లో 6వ తరగతి ప్రవేశ పరీక్ష ఫలితాలు విడుదలయ్యాయి.
- 12లో

వాతావరణం
గరిష్టం/కనిష్టం
35°/25°
ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఉరుములతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

సూర్యాపేటకు బీసీ గురుకుల డిగ్రీ కళాశాల మంజూరు

సూర్యాపేట: సూర్యాపేటకు బీసీ గురుకుల డిగ్రీ కళాశాల మంజూరైంది. సీఎం కేసీఆర్ నిర్ణయం మేరకు రాష్ట్ర వ్యాప్తంగా 17 బీసీ గురుకులాలు మంజూరు చేస్తూ ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇందులో సూర్యాపేట కూడా ఉండడం విశేషం. ఈ విద్యా సంవత్సరం నుంచే సూర్యాపేట గురుకుల డిగ్రీ కళాశాలలో అడ్మిషన్లు ప్రారంభం కానున్నాయి. రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి జగదీష్‌రెడ్డి చొరవతో సూర్యాపేటకు బీసీ గురుకుల డిగ్రీ కళాశాల మంజూరు కావడం పట్ల జిల్లా వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

27న జాబ్‌మేళా

దురాజ్‌పల్లి (సూర్యాపేట): జిల్లాలోని నిరుద్యోగ యువతకు ప్రైవేటు కంపెనీల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు గాను ఈ నెల 27న ఉదయం 11 గంటలకు సూర్యాపేట కలెక్టరేట్‌లోని ఉపాధి కల్పన కార్యాలయంలో జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి సామ మాధవరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్బన్ సిటీ డెవలపర్స్ ప్రైవేటు కంపెనీలో మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ 200 ఖాళీలు, మార్కెటింగ్ మేనేజర్ 100 ఖాళీలు ఉన్నాయని, జీతం నెలకు రూ.15 వేల నుంచి రూ.18 వేల వరకు ఉంటుందని పేర్కొన్నారు. అలాగే శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ సూర్యాపేట బ్రాంచ్‌లో మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ 10 ఖాళీలు కలవని, జీతం నెలకు రూ.16వేల ఇతర అలవెన్స్ ఉంటాయని తెలిపారు. 10వ తరగతి ఆపై విద్యార్హత కలిగి 18 నుంచి 32 సంవత్సరాల మధ్య వయస్సు గల నిరుద్యోగులు అర్హులని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు అర్బన్ సిటీ డెవలపర్స్ మేనేజర్ సెల్ 9573381973, శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ మేనేజర్ సెల్ 9110549902 నంబర్లను సంప్రదించాలని కోరారు.

మాలలకు సముచిత స్థానం కల్పించాలి



సమావేశంలో మాట్లాడుతున్న వెంకన్న

భానుపురి (సూర్యాపేట): తెలంగాణ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలల్లో మాలలకు సముచిత స్థానం కల్పించాలని మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు మేక వెంకన్న డిమాండ్ చేశారు. శుక్రవారం సూర్యాపేటలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మాలల సమస్యలను ప్రభుత్వం, మంత్రి జగదీష్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లామన్నారు. రాష్ట్రంలో కులాల వారీగా నిర్మిస్తున్న సంక్షేమ భవనాల్లో భాగంగా జిల్లా కేంద్రంలో మాలలకు కూడా నిర్మించాలని కోరారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ఇచ్చే దళితబంధు పథకంలో మాలలకు సమాన అవకాశం కల్పించాలని కోరారు. ఈ సమావేశంలో మాల మహానాడు నాయకులు గాజుల రాంబాయమ్మ, పిట్టల భాగ్యమ్మ, చందా దాసు, బొల్లెద్దు వినయ్, కుమార్, దశరథ తదితరులు పాల్గొన్నారు.

మట్టపల్లిలో విశేష పూజలు



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

మఠంపల్లి: మట్టపల్లి క్షేత్రంలో శుక్రవారం శ్రీరాజ్యలక్ష్మీ, చెంచులక్ష్మీ సమేత శ్రీలక్ష్మీనృసింహస్వామి వారికి అర్చకులు విశేష పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా తెల్లవారు జాము నుంచే ఆలయంలో సుప్రభాతసేవ, పంచామృతాభిషేకం, అష్టోత్తర, సహస్ర, కుంకుమార్చనలు చేపట్టారు. అనంతరం స్వామి అమ్మవార్లను నూతన పట్టువస్త్రాలతో వధూవరులుగా అలంకరించి ఎదుర్కోలు మహోత్సవం జరిపారు. అనంతరం నిత్యకల్యాణాన్ని వైభవంగా నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అనువంశిక చైర్మన్ చెన్నూరు విజయ్‌కుమార్, ఈఓ నవీన్, అర్చకులు రామాచార్యులు, పద్మనాభాచార్యులు, లక్ష్మీనరసింహమూర్తి, ఆంజనేయాచార్యులు, భక్తులు పాల్గొన్నారు.

29న గాయత్రి వ్రతపూజ

మట్టపల్లి క్షేత్రంలోని విశ్వబ్రాహ్మణ నిత్యాన్నదాన సత్రంలో ఈనెల 29న తొలి ఏకాదశి పర్వదినం పురస్కరించుకుని శ్రీగాయత్రిమాత విశ్వకర్మ వ్రతపూజ నిర్వహించనున్నట్లు సత్రకమిటీ అధ్యక్షుడు ఉద్దోజు సూర్యనారాయణాచారి తెలిపారు. శుక్రవారం ఆయన స్థానికంగా విలేకరులతో మాట్లాడారు. ఈనెల 28, 29వ తేదీల్లో తొలి ఏకాదశికి క్షేత్రానికి వచ్చే విశ్వబ్రాహ్మణ భక్తులకు సత్రంలో ఉచిత భోజన వసతి ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఆయన వెంట సత్ర కమిటీ ప్రధాన కార్యదర్శి వీరాచారి, కోశాధికారి బ్రహ్మయ్యాచారి తదితరులు ఉన్నారు.

కృష్ణాతీరం.. కబ్జాల మయం

పాలకవీడులో 6వేల ఎకరాలకుపైగా అటవీ భూముల్లో సగం ఆక్రమణ



వజ్రాలగని ప్రాంతంలో ఇటీవల చెట్లు తొలగించి చదును చేసిన అటవీ భూమి

- రాత్రికి రాత్రే చదును చేసి పాగా వేస్తున్న అక్రమార్కులు
- కబ్జా భూములను అమ్మకానికి పెడుతున్న ఘనులు
- అటవీ శాఖ అధికారుల కనుసన్నల్లోనే కొనసాగుతున్న ఆక్రమణలు



అటవీ భూముల్లోకి వేసిన పైప్‌లైన్

పాలకవీడు: పాలకవీడు మండల పరిధిలోని కృష్టా నది తీర ప్రాంతంలో వేల ఎకరాల్లో విస్తరించి ఉన్న అటవీ భూములు ఆక్రమణకు గురవుతున్నాయి. అక్రమార్కులు రాత్రికి రాత్రే భారీ యంత్రాల సాయంతో ఎకరాలకొద్దీ అటవీ భూములను చదును చేసి కబ్జా చేసేస్తున్నారు. ప్రభుత్వం హరితహారం పేరుతో అటవీ సంపద, పచ్చదనం పెంచాలనే సదుద్దేశంతో రూ.కోట్లు ఖర్చుచేసి మొక్కలు నాటుతుంటే.. అక్రమార్కులు మాత్రం పంటల సాగు పేరుతో ప్రకృతి సంపదను కొల్లగొడుతున్నారు. మండల పరిధిలోని వివిధ బ్లాకుల్లో కంపార్ట్‌మెంట్లుగా విస్తరించిన ఉన్న దాదాపు 6వేల ఎకరాలకుపైగా భూముల్లో ఇప్పటి వరకు 3 వేల ఎకరాల భూములు కబ్జాకు గురయ్యాయి. ఇదంతా అటవీ శాఖ అధికారుల కనుసన్నల్లోనే జరుగుతుందని ప్రజలు ఆరోపిస్తున్నారు.

అటవీ భూములు (ఎకరాల్లో..)

బ్లాక్ పేరు	విస్తీర్ణం
సైదులు నామా	2,756.6
పసుపుబోడు	2,215.4
యల్లంబోడు	371.8
మంగళ్‌బోడు	226
వజ్రాల గని	596.5
దుప్పలగుట్ట	259.9
వేరుచింతవాగు	100
మొత్తం	6,526.2

దర్జాగా పైప్‌లైన్లు వేసి..

ఇటీవల కొందరు అక్రమార్కులు గుండ్లపహాడ్ జోన్ వజ్రాలగని రక్షిత అటవీ ప్రాంతంలో రాత్రిళ్లు భారీ యంత్రాలైన ప్రొక్లెయిన్‌లు, జేసీబీలు, డోజర్ల సాయంతో చెట్లను తొలగించి అటవీ భూమిని చదును చేసి వాగు, కుంటల నుంచి పైప్‌లైన్లు వేసి వ్యవసాయ సాగుకు యోగ్యంగా మార్చారు. ఈ భూములకు విద్యుత్ కనెక్షన్లు ఏర్పాటు చేసుకొని సాగు పనులు చేసుకుంటున్నారు. అలాగే జానపహాడ్ సైదులు నామా రిజర్వు ఫారెస్ట్ పరిధిలోని వేరుచింత వాగు ప్రాంతం సుమారు 18 ఎకరాల అటవీ భూమి ఆక్రమణకు గురికాగా ఆక్రమణదారులు ఆ భూమిని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన వ్యక్తులకు ఎకరం సుమారు రూ.5లక్షలకు విక్రయించినట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇవన్నీ బాహాటంగానే కనిపిస్తున్నా అటవీ శాఖ అధికారులు నిర్లక్ష్యం వహిస్తుండడం పలు అనుమానాలకు తావిస్తోంది. మామూళ్లు ఇస్తున్న వారికే రాత్రికిరాత్రి ఆక్రమణలకు అనుమతులు ఇస్తున్నారని, రూ.లక్షలు చేతులు మారుతున్నాయని ఆయా గ్రామాల ప్రజలు బహిరంగంగా ఆరోపిస్తున్నారు.

ఇటీవల అధికారులపై దాడి

ఇటీవల ఘన్యపహాడ్ పరిధి రక్షిత అటవీ ప్రాంతంలో పాలకవీడు బేస్‌క్యాంపు సిబ్బంది ఆక్రమణలను అడ్డుకోవడానికి ప్రయత్నించగా వారిపై ఆక్రమణదారులు దాడిచేసి గాయపరిచారు. అటవీ భూములను ఆక్రమించేందుకు అక్రమార్కులు ఎంతకైనా బరితెగిస్తున్నారు. మండల పరిధిలోని అన్ని బ్లాకుల్లో ఇదే తరహా ఆక్రమణలు జరుగుతున్నాయి. ప్రభుత్వం పోడు భూములకు పట్టాలు ఇస్తాననడంతో ఆక్రమణలు మరింత పెరిగాయి. ఇటీవల ఆక్రమణలపై విజిలెన్స్ అధికారులు సైతం విచారణ చేపట్టారు. అటవీ భూముల ఆక్రమణలపై ఫారెస్ట్ రేంజ్ హుజూర్‌నగర్ అధికారిని వివరణ కోరగా నేడు, రేపు వివరాలు వెల్లడిస్తామంటూ సమాధానం దాటవేస్తున్నారు.



కొండేటి ఏడుకొండలుకు గులాబీ కండువా కప్పి బీఆర్‌ఎస్ పార్టీలోకి ఆహ్వానిస్తున్న మంత్రి జగదీష్‌రెడ్డి

కేసీఆర్ నాయకత్వమే శ్రీరామరక్ష

- విద్యుత్ శాఖ మంత్రి జగదీష్‌రెడ్డి
- బీఆర్‌ఎస్‌లో చేరిన బీజేపీ నాయకుడు ఏడుకొండలు

సూర్యాపేట: సీఎం కేసీఆర్ నాయకత్వమే రాష్ట్రానికి శ్రీరామరక్ష అని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి అన్నారు. సూర్యాపేట పట్టణంలోని 7వ వార్డు ఇందిరమ్మ కాలనీ పేజ్–2కు చెందిన బీజేపీ పట్టణ మాజీ అధ్యక్షుడు కొండేటి ఏడుకొండలు శుక్రవారం మంత్రి సమక్షంలో బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ దేశవ్యాప్తంగా 30 శాతం మంది ప్రజలు ఒక్కపూట భోజనం మాత్రమే తింటూ మిగతా పూటలు పస్తులుంటుంటే, తెలంగాణలో కేసీఆర్ పాలనలో ఆకలి, దరిద్రాలు లేకుండా చేశారన్నారు. ఇంటింటికీ తాగునీరు, వ్యవసాయానికి 24 గంటల విద్యుత్ ఇస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ అని చెప్పారు. బీజేపీ, కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో ఇప్పటికీ చాలా గ్రామాల్లో కరెంటు లైన్‌లు కూడా లేవన్నారు. 2014 ముందు మూసీ ప్రాజెక్టు గేట్లు శిథిలావస్థకు చేరి నీరు వృథాగా పోతున్నా పట్టించుకున్న వారే లేరన్నారు. తాను గెలిచిన మరుక్షణమే సీఎం దృష్టికి తీసుకొచ్చి గేట్లను ఆధునీకరించామన్నారు. సూర్యాపేటను సుందరంగా తీర్చిదిద్దే యజ్ఞంలో ప్రతిఒక్కరూ భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. బీఆర్‌ఎస్‌లో చేరిన ఏడుకొండలు, మహిళా మోర్చా నాయకులకు మంత్రి శుభాకాంక్షలు తెలిపారు. గులాబీ కండువా కప్పి సాదారంగా బీఆర్‌ఎస్‌లోకి ఆహ్వానించారు. పార్టీలో చేరినవారిలో పాల్వాయి వెంకన్న శైలజ, పాపారావు అశోక్, లక్ష్మయ్య, చారి, నిర్మల, శ్రీరాములు, సైదా, మరో 200 మంది బీజేపీ కార్యకర్తలు, మహిళా మోర్చా నాయకులు ఉన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ రాష్ట్ర కార్యదర్శి వై.వెంకటేశ్వర్లు, మున్సిపల్ చైర్‌పర్సన్ పెరుమాళ్ల అన్నపూర్ణ, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నిమ్మల శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేట్‌కు దీటుగా గిరిజన రెసిడెన్షియల్ స్కూల్



పాఠశాల భవనాన్ని పరిశీలిస్తున్న మంత్రి

చివ్వెంల: కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా మండల పరిధిలోని ఐలాపురం గ్రామంలో ప్రభుత్వ గిరిజన రెసిడెన్షియల్ పాఠశాలను నిర్మిస్తున్నట్లు రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి అన్నారు. సూర్యాపేట–ఖమ్మం 365 జాతీయ రహదారి వెంట ఐలాపురం గ్రామ శివారులో నిర్మించిన గిరిజన రెసిడెన్షియల్ పాఠశాలను శుక్రవారం మంత్రి సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుపేద గిరిజన విద్యార్థినుల కోసం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మూడు ఎకరాల విస్తీర్ణంలో రూ.4.20కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న పాఠశాలకు మరో రూ.5 కోట్లు అదనంగా మంజూరైనట్లు పేర్కొన్నారు. మూడు అంతస్తుల్లో 28 తరగతి గదులతో నిర్మిస్తున్న ఈ భవనంలో 640 మంది విద్యార్థినులు విద్యనభ్యసించనున్నట్లు తెలిపారు. డైనింగ్ హాల్, కిచెన్‌లో మార్పులు చేయాలని అధికారులను ఆదేశించారు. మంత్రి వెంట బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు జూలకంటి జీవన్‌రెడ్డి, సర్పంచ్ బోడపట్ల సునీతశ్రీను, మండల, జిల్లా నాయకులు ఉన్నారు.

అనాథలను ప్రభుత్వమే ఆదుకోవాలి



కలెక్టరేట్ ఎదుట దీక్షలో పాల్గొన్న నాయకులు

దురాజ్‌పల్లి (సూర్యాపేట): రాష్ట్రంలోని అనాథలను ఆదుకొని, గతంలో ముఖ్యమంత్రి కేసీఆర్ ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని మహాజన సోషలిస్టు పార్టీ ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి కందుకూరి సోమన్న మాదిగ, ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జి యాతాకుల రాజన్న మాదిగ కోరారు. అనాథ హక్కుల పోరాట వేదిక ఆధ్వర్యంలో శుక్రవారం కలెక్టరేట్ ఎదుట పుట్టల మల్లేష్ మాదిగ నేతృత్వంలో చేపట్టిన అనాథల అరిగోస దీక్షలో వారు మాట్లాడారు. కేటీఆర్ నాయకత్వంలో మంత్రివర్గ సమావేశం ఏర్పాటు చేసి అనాథలకు స్మార్ట్ కార్డులు, కేజీ నుంచి పీజీ చదువుల వరకు ఉచితంగా విద్య, వైద్యం అందిస్తామని తీర్మానాలు చేసి నేటి వరకు అమలు చేయలేదన్నారు. కార్యక్రమంలో చింతలపాటి చిన్న శ్రీరాములు మాదిగ, ములకలపల్లి రవి మాదిగ, ఏపూరి రాజు మాదిగ, పాల్వాయి బాలయ్య మాదిగ, బొజ్జ వెంకన్న మాదిగ పాల్గొన్నారు.

గెస్ట్ లెక్చరర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

రామగిరి(నల్లగొండ): ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని బీసీ గురుకుల పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో తాత్కాలిక ప్రాతిపదికన ఉపాధ్యాయులు, అధ్యాపకుల పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ఆర్‌సీఓ షకీనా శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. హిందీ, ఇంగ్లిష్, గణితం, భౌతికశాస్త్రం, జీవశాస్త్రం, సాంఘిక శాస్త్రం సబ్జెకులు ఖాళీగా ఉన్నట్లు పేర్కొన్నారు. సంబంధిత సబ్జెక్టుల్లో పీజీ, బీఈడీ చేసినవారు అర్హులని పేర్కొన్నారు. ఈనెల 27వ తేదీ లోగా అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పూర్తి వివరాలకు కనగల్ (నల్లగొండ) 79934 56805, అనంతగిరి(సూర్యాపేట) 79934 56808, ఎస్‌ఓఈ (యాదాద్రి భువనగిరి) 94404 20159 ఫోన్ నంబర్లను సంప్రదించాలని కోరారు.

యాదాద్రిలో ఊంజలి సేవ

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో శుక్రవారం ఆండాళ్ అమ్మవారికి ఊంజలి సేవ ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి ఇష్టమైన రోజు కావడంతో ప్రత్యేకంగా అలంకరించి, ఆలయ ప్రథమ ప్రాకార మండపంలో ఊరేగించారు. అనంతరం అమ్మవారికి ఊంజలి సేవ జరిపించారు. అదే విధంగా యాదాద్రీశుడి ప్రధానాలయంలో నిత్యారాధనలు కొనసాగాయి. వేకువ జామున సుప్రభాతం, అభిషేకం, అర్చనలు, సుందర్శన హోమం, నిత్యకల్యాణం తదితర కైంకర్యాలు గావించారు. ఆయా వేడుకల్లో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు.

పేటలో నేటి నుంచి 'భట్టి' పాదయాత్ర

- డీసీసీ అధ్యక్షుడు చెవిటి వెంకన్నయాదవ్

భానుపురి (సూర్యాపేట): సీఎల్పీ నేత భట్టి విక్రమార్క చేపట్టిన పీపుల్స్ మార్చ్ పాదయాత్ర శనివారం నుంచి మూడు రోజులపాటు జిల్లాలో కొనసాగుతుందని డీసీసీ అధ్యక్షుడు చెవిటి వెంకన్న యాదవ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 24వ తేదీన సాయంత్రం ఐదు గంటలకు సూర్యాపేట మండలం వెదిరెవారిగూడెం నుంచి మొదలై సూర్యాపేట పట్టణం చివ్వెంల మండలం మీదుగా వెళుతుందన్నారు. తొలిరోజు వెదిరెవారిగూడెం, సూర్యాపేట పట్టణం కుసుమవారిగూడెం, సైనికపురి కాలనీ వరకు చేరుకొని రాత్రి అక్కడే బస చేస్తారని తెలిపారు. 25వ తేదీ ఆదివారం సాయంత్రం ఐదు గంటలకు సైనికపురి కాలనీ నుంచి కృష్ణాటాకీస్, ఎడ్ల గోపయ్య విగ్రహం, పూల సెంటర్ మీదుగా శబరమ్మ హోటల్, శంకర్ విలాస్ సెంటర్ చేరుకొని అక్కడ జరిగే కార్నర్ మీటింగ్‌లో బట్టి విక్రమార్క మాట్లాడుతారని తెలిపారు. అనంతరం నల్లాల బావి, డీమార్ట్, ఖమ్మం క్రాస్ రోడ్డు మీదుగా బీబీగూడెం వరకు చేరుకొని రాత్రి బస ఉంటుందని చెప్పారు. 26వ తేదీన బీబీగూడెం నుంచి కొండలరాయినిగూడెం, మున్యానాయక్ తండా, కర్వినాగారం, రాజు తండా మీదుగా పాండ్యానాయక్‌తండా వరకు చేరుకొని మధ్యాహ్న భోజన విరామం తీసుకుంటారని పేర్కొన్నారు. తిరిగి సాయంత్రం నాలుగు గంటల నుంచి పాండ్యానాయక్ తండా, మోదిన్‌పురం, తిమ్మాపురం, మీదుగా చందుపట్ల గ్రామ శివారు నుంచి ఖమ్మం జిల్లాలోకి పాదయాత్ర ప్రవేశిస్తుందని తెలిపారు. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాదయాత్రను జయప్రదం చేయాలని కోరారు.

నేడు 'డయల్ యువర్ ఆర్‌ఎం'

నల్లగొండ రూరల్: ఆర్టీసీ ప్రయాణికుల సమస్యలు, సలహాల కోసం డయల్ యువర్ ఆర్టీసీ ఆర్‌ఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆర్‌ఎం శ్రీదేవి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సెల్ : 86881 95076 నంబర్‌కు ఫోన్ చేసి ప్రయాణికులు తాము ఎదుర్కొంటున్న సమస్యలు తెలియజేస్తూ, సలహాలు ఇవ్వాలని ఆమె పేర్కొన్నారు.

2.89 లక్షల మందికి 'రైతుబంధు'

- ఈ సారి ముందస్తు పంపిణీకి ప్రభుత్వం నిర్ణయం
- 26 నుంచి రైతుల ఖాతాల్లో జమ
- జిల్లాలో 6.34లక్షల ఎకరాలకు రూ.317 కోట్లు
- 84 మంది పోడు రైతులకూ పథకం వర్తింపు



తిరుమలగిరి (తుంగతుర్తి): ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2023–24) వానాకాలం సీజన్‌కు సంబంధించి 11వ విడత రైతుబంధు పెట్టుబడి సాయాన్ని ఈ నెల 26 నుంచి అందించడానికి ప్రభుత్వం సిద్ధమవుతోంది. జిల్లాలో 2,89,172 మంది రైతులకు సంబంధించి 6.34 లక్షల ఎకరాలకు రూ.5 వేల చొప్పున మొత్తం 317 కోట్ల రూపాయలు వారి ఖాతాల్లో జమకానున్నాయి. రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ ఈ నెలలోనే రైతుబంధు పంపిణీ చేస్తామని ప్రకటించడంతో వ్యవసాయ అధికారులు పూర్తిస్థాయి జాబితా రూపకల్పనలో నిమగ్నమయ్యారు. గత యాసంగి జాబితాతోపాటు కొత్తగా ఆన్‌లైన్‌లో నమోదైన జాబితాను సిద్ధం చేశారు.

గత ఏడాది జూలైలో..

ప్రభుత్వం ఏటా రెండు పంటలకు రైతుబంధు పేరుతో రైతులకు పెట్టుబడి సాయం అందిస్తుంది. ఒక్కో పంట కాలానికి ఎకరాకు రూ.5 వేల చొప్పున రెండు సీజన్లకు కలిపి రూ.10 వేలు అందిస్తుంది. గత ఏడాది వానాకాలం సీజన్‌కు సంబంధించి జూలై మాసంలో ప్రభుత్వం రైతుబంధు సాయం అందజేసింది. ఈ సంవత్సరం ముందస్తుగానే ఇస్తున్నట్లు ముఖ్యమంత్రి ప్రకటించడానికి తోడు జిల్లాలో రెండు రోజులుగా వర్షాలు కురుస్తుండడంతో రైతుల్లో ఆనందం వెల్లివిరుస్తోంది.

పోడు పట్టాలు పొందిన గిరిజనులకు కూడా..

ప్రభుత్వం పోడు భూములకు పట్టాలు ఇవ్వడానికి ఏర్పాట్లు చేస్తోంది. ఈ భూములు పట్టా పొందిన గిరిజనులకు రైతుబంధు ఇవ్వనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. సూర్యాపేట జిల్లాలో 84 మంది రైతులకు 83.37 ఎకరాల భూమి పట్టాలు అందివ్వనున్నారు. వీరికి కూడా రైతుబంధు సాయం అందజేస్తారు.

తొలుత చిన్న, సన్నకారు రైతులకు..

జిల్లాలో 1.50 లక్షల మంది చిన్న, సన్నకారు రైతులు ఉంటారు. తొలుత వీరి ఖాతాల్లో ఎకరాకు రూ.5 వేలు జమ కానున్నాయి. తరువాత 5 ఎకరాలు దాటిన రైతులకు ప్రాధాన్యత క్రమంలో అర్హులకు రైతుబంధు అందనుంది.

కొత్త వారికీ అవకాశం

కొత్తగా భూములు కొనుగోలు చేసిన రైతులు, అన్నదమ్ముల భాగ పంపిణీ, పసుపు, కుంకుమల కింద ప్రస్తుత జూన్ 16 వరకు పట్టాలు చేయించుకొని పట్టాదారు పాస్ పుస్తకాలు పొందిన వారికి ప్రభుత్వం రైతుబంధుకు అవకాశం కల్పించింది. వీరు వ్యవసాయ శాఖ అధికారులకు తమ పాస్ పుస్తకం, ఆధార్ కార్డు, బ్యాంకు పాస్ పుస్తకం జిరాక్స్‌లను అందివ్వాలి. వ్యవసాయ అధికారులు రైతుల పాస్ పుస్తకాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారు. రైతులు తమ బ్యాంకు ఖాతాను రైతుబంధుకు అనుసంధానం చేసేందుకు అవకాశం కల్పించింది. రైతులు తమ పాత బ్యాంకు ఖాతాను మార్చుకొని కొత్తవి నమోదు చేసుకోవాలనుకుంటే ఏఈఓల దగ్గర దరఖాస్తు చేసుకోవాలి. బ్యాంకు ఖాతాతో పాటు ఫోన్ నంబర్ సైతం మార్చుకునే వెసులుబాటు ఉంది.

క్లుప్తంగా

తాటిచెట్టు పైనుంచి పడి గీత కార్మికుడికి గాయాలు

వలిగొండ: తాటిచెట్టు పైనుంచి పడి గీత కార్మికుడికి తీవ్రగాయాలైన ఘటన వలిగొండ మండలంలోని రెడ్లరేపాక గ్రామంలో శుక్రవారం చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. రెడ్డరేపాక గ్రామానికి చెందిన గీత కార్మికుడు జువ్వగాని రాములు రోజుమాదిరిగా గురువారం కూడా గ్రామ సమీపంలో కల్లు గీసేందుకు తాటిచెట్టు ఎక్కుతుండగా ప్రమాదవశాత్తు కిందపడ్డాడు. దీంతో అతడికి తీవ్రగాయాలయ్యాయి. గ్రామస్తులు గమనించి అతడిని చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. బాధితుడిని ప్రభుత్వపరంగా ఆదుకోవాలని పలువురు గీతకార్మిక సంఘం నాయకులు కోరారు.

యువతి అదృశ్యం.. కేసు నమోదు


షఫియా

హుజూర్‌నగర్: పట్టణంలోని దద్ద నాలచెరువు కాలనీకి చెందిన యువతి అదృశ్యమైనట్లు శుక్రవారం ఫిర్యాదు అందిందని ఎస్‌ఐ వెంకటరెడ్డి తెలిపారు. ఎస్‌ఐ తెలిపిన వివరాల ప్రకారం.. దద్దనాలచెరువు కాలనీకి చెందిన షేక్ రిహానా, ఖాజామియా దంపతులకు కుమారుడు, కుమార్తె షేక్ షఫియా సంతానం. షఫియా ఇంటి వద్దనే ఉంటోంది. కాగా గురువారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో షఫియా బ్యాగులో బట్టలు సర్దుకుని ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. చుట్టుపక్కల ఎంత వెతికినా షఫియా ఆచూకీ లభించకపోవడంతో శుక్రవారం ఆమె తండ్రి ఖాజామియా పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

వలిగొండ: మండల కేంద్రంలోని బీసీ కాలనీలో మధుగాని దాసు ఇంట్లో శుక్రవారం రాత్రి 8మంది వ్యక్తులు పేకాట ఆడుతున్నట్లు సమాచారా అందడంతో ఎస్‌ఐ ప్రభాకర్ ఆధ్వర్యంలో పోలీసులతో దాడి చేసి వారిని అరెస్ట్ చేశారు. వారి వద్ద నుండి రూ.14,790 నగదు, 6 సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

నాలుగు వ్యవసాయ మోటార్లు చోరీ

గరిడేపల్లి: మండలంలోని తాళ్లవాగు వద్ద రైతులు ఏర్పాటు చేసుకున్న నాలుగు వ్యవసాయ మోటార్లను శుక్రవారం గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేశారు. ఆటోలో వచ్చిన వరుసగా ఉన్న మోటార్లను దొంగిలించారని బాధిత రైతులు పెండెం అరవింద్, బండా నర్సిరెడ్డి, అనంతు నరసయ్య తెలిపారు. వ్యవసాయ పనులు ప్రారంభమయ్యే సమయంలో వ్యవసాయ మోటార్లపై పోలీసులు నిఘా పెట్టాలని కోరారు.

విధి రాత.. కన్నోళ్లకు కడుపుకోత

- కష్టాలు తీరుస్తాడనుకున్న కుమారుడు పిడుగుపాటుకు గురై మృతి
- కాలుకి శస్త్రచికిత్స జరిగి మంచానికే పరిమితమైన తండ్రి
- పేద కుటుంబానికి బాసట కరువు


కుటుంబ సభ్యులతో గోపి (ఫైల్)

మాడుగులపల్లి: పేదరికాన్ని సైతం లెక్క చేయకుండా మనోధైర్యంతో కష్టాల కడలిని ఈదుతున్నారు ఆ దంపతులు. తమ ఇబ్బందులను చూసి అత్యుత్తమంగా చదువుతూ పనిలోనూ చేదోడు వాదోడుగా ఉంటున్న కుమారుడిని చూసి పొంగిపోయారు. కానీ ఆ సంతోషం ఎంతో కాలం నిలువ లేదు. విధి వారికి కడుపుకోతను మిగిల్చింది. పిడుగు రూపంలో కుమారుడిని బలిగొనడంతో కన్నవారు తామెరికోసం బతకాలంటూ.. తమకిక దిక్కెవరంటూ రోదిస్తున్న తీరు గ్రామస్తులను కంటతడి పెట్టిస్తోంది. మాడుగులపల్లి మండలం పాములపహాడ్ గ్రామానికి చెందిన లింగయ్య, లక్ష్మి దంపతులకు కుమారుడు, కుమార్తె సంతానం. కుమారుడు గోపి(21) డిగ్రీ ఫైనలియర్, కుమార్తె ఇంటర్ చదువుతున్నారు. గోపి మొదటి నుంచి చదువుల్లో చురుకు. స్థానిక జెడ్పీహెచ్‌ఎస్‌లో పదో తరగతి చదివి 8.7 జీపీఏ సాధించాడు. ఇంటర్‌లోనూ 750 మార్కులు సాధించాడు. సూర్యాపేటలోని ఓ ప్రైవేట్ కళాశాలలో డిగ్రీ చదువుతూ సెలవు రోజుల్లో తండ్రికి పనుల్లో చేదోడు వాదోడుగా ఉంటున్నాడు. ఏడాది క్రితం తండ్రి లింగయ్యకు రోడ్డు ప్రమాదంలో గాయపడగా, కాలుకు శస్త్ర చికిత్స జరిగడంతో మంచానికే పరిమితమయ్యాడు. అప్పటి నుంచి తమకున్న రెండెకరాల భూమిలో వ్యవసాయం, జీవాల పెంపకం తదితర పనులన్నీ గోపినే చూసుకుంటున్నాడు. ఈ నెల 20వ తేదీన పక్కింటి వ్యక్తితో కలిసి గోపి గొర్రెల మందను మేపేందుకు తోలుకెళ్లాడు. సాయంత్రం ఒక్కసారిగా ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో వర్షం ప్రారంభంకావడంతో ఇద్దరు సమీపంలోని చెట్టు కిందకు వెళ్లగా పక్కనే పిడుగుపడి గోపి మృతిచెందాడు. ఊహించని ఈ ఘటన నుంచి ఆ తల్లిదండ్రులు తేరుకోలేకపోతున్నారు. ఓ వైపు భర్త మంచాన పడడం.. చేతికొచ్చిన కుమారుడు తిరిగిరాని లోకాలకు వెళ్లడంతో ఆ కన్నతల్లి వేదన వర్ణనాతీతంగా మారింది. వృద్ధాప్యంలో తమకెవరు దిక్కంటూ తల్లిదండ్రులు రోదిస్తున్న తీరు గ్రామస్తులను కంటతడి పెట్టిస్తోంది. పుట్టెడు కష్టంలో ఉన్న నిరు పేద కుటుంబానికి ప్రభుత్వం, దాతలు బాసటగా నిలువాలని గ్రామస్తులు కోరుతున్నారు.

విద్యుదాఘాతంతో మహిళ మృతి

- ఇంటి యజమాని నిర్లక్ష్యమే కారణమంటూ బంధువుల ఆందోళన


పసునూరి జానమ్మ (ఫైల్)

చివ్వెంల (సూర్యాపేట): విద్యుదాఘాతంతో మహిళ మృతిచెందిన ఘటన చివ్వెంల మండల పరిధిలోని వట్టిఖమ్మంపహాడ్ గ్రామంలో శుక్రవారం చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. వట్టిఖమ్మంపహాడ్ గ్రామానికి చెందిన గింగిరాల రాజ్యలక్ష్మి ఇంట్లో పసునూరి జానమ్మ(42) అద్దెకు ఉంటుంది. శుక్రవారం జానమ్మ ఇంట్లో దుస్తులు తీస్తుండగా వర్షానికి ఇంట్లోని రేకులకు విద్యుత్ సరఫరా అయ్యి విద్యుత్ షాక్‌తో ఆమె అక్కడికక్కడే మృతిచెందింది. కాగా జానమ్మ అద్దెకు ఉన్న రూంలో గత కొన్నిరోజులుగా పలు వస్తువులకు విద్యుత్ షాక్ వస్తుందని ఇంటి యజమానికి చెప్పినా ఆమె పట్టించుకోలేదని, ఇంటి యజమాని నిర్లక్ష్యంతోనే జానమ్మ చనిపోయిందని కుటుంబ సభ్యులు, బంధువులు ఆందోళన చేపట్టారు. మృతురాలి భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ విష్ణుమూర్తి తెలిపారు. మృతురాలికి ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు.

ఎంపీటీసీ భర్త కారు ధ్వంసం


ధ్వంసమైన కారు

తుర్కపల్లి: మండల కేంద్రంలో నివాసముంటున్న ఎంపీటీసీ సభ్యురాలు వనజ భర్త హన్మంత్‌రెడ్డి కారును శుక్రవారం తెల్లవారుజామున వారి ఇంటి పక్కన నివాసముండే వ్యక్తి ధ్వంసం చేశాడు. పోలీసులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. తుర్కపల్లి మండల కేంద్రంలోఎంపీటీసీ సభ్యురాలు వనజ ఇంటి పక్కనే డొంకెన జంగయ్య అనే వ్యక్తి నివాసముంటున్నాడు. వనజ భర్త హన్మంత్‌రెడ్డి గురువారం రాత్రి తమ కారును తమ ఇంటి ముందు పార్కింగ్ చేశాడు. కాగా శుక్రవారం తెల్లవారుజామున 4గంటల సమయంలో జంగయ్య హన్మంత్‌రెడ్డి కారుపై రాళ్లు వేసి అద్దాలు, డోర్లు ధ్వంసం చేశాడు. ఉదయం లేచి చూసే సరికి కారు అద్దాలు ధ్వంసమై ఉండడంతో హన్మంత్‌రెడ్డి స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రాఘవేందర్‌గౌడ్ తెలిపారు.

ట్రాక్టర్ ఢీకొని వ్యక్తి మృతి


రాములు మృతదేహం

నిడమనూరు: నిర్మాణంలో ఉన్న కెనాల్ బ్రిడ్జి వద్ద నైట్ వాచ్‌మన్‌గా ఉన్న వ్యక్తిని ట్రాక్టర్ ఢీకొట్టడంతో తీవ్రగాయాలపాలై ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం సాయంత్రం మృతిచెందాడు. ఎస్‌ఐ శోభన్‌బాబు తెలిపిన వివరా ప్రకారం.. నిడమనూరు మండలం తుమ్మడం గ్రామానికి చెందిన ఆకుల రాములు (66) గ్రామ సమీపంలో నిర్మాణంలో ఉన్న కెనాల్ బ్రిడ్జి వద్ద గురువారం రాత్రి నైట్ వాచ్‌మన్‌గా ఉన్నాడు. ఈ క్రమంలో అర్ధరాత్రి 2గంటల సమయంలో ముకుందాపురం నుంచి నారమ్మగూడెం వైపు వెళ్తున్న ట్రాక్టర్(టీఎస్ 05 యూడీ 8799) డ్రైవర్ అజాగ్రత్తగా, అతివేగంగా వచ్చి బ్రిడ్జి వద్ద కూర్చొని ఉన్న ఆకుల రాములును ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో రాములుకు రెండు కాళ్లు విరిగాయి. రాములు బంధువు అదే సమయంలో అటుగా వెళ్తూ గమనించి వెంటనే కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చాడు. వారు రాములును మిర్యాలగూడలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం సాయంత్రం మృతిచెందాడు. మృతుడి కుమారుడు ఆకుల శ్రీనివాస్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

వ్యక్తిపై కర్రలతో దాడి.. ఇద్దరిపై కేసు

పెన్‌పహాడ్: తన భూమిని అక్రమంగా దున్నుతున్న వారిని అడ్డుకున్న వ్యక్తిపై దాడి చేసి గాయపర్చిన ఘటన పెన్‌పహాడ్ మండల పరిధిలోని సింగారెడ్డిపాలెం గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. ఏఎస్‌ఐ వెంకటరత్నం తెలిపిన వివరాల ప్రకారం.. సింగారెడ్డిపాలెం గ్రామానికి చెందిన పేర్ల మల్లయ్య తన కుమార్తె మౌనికను చివ్వెంల మండలం గుంజలూరు గ్రామానికి చెందిన వీరబోయిన నరేష్‌కి ఇచ్చి 2018లో వివాహం జరిపించాడు. వివాహ సమయంలో కూతురుకు 1.20 ఎకరాల వ్యవసాయ భూమిని కట్నం కింద ఇస్తానని ఒప్పుకున్నాడు. అయితే తన కూతురు మౌనికను అల్లుడు నరేష్ వేధిస్తుండడంతో భూమిని పట్టా చేయలేదు. నరేష్‌తో పాటు అతడి తండ్రి వెంకన్న శుక్రవారం ట్రాక్టర్‌తో దౌర్జన్యంగా తన పొలాన్ని దున్నుతుండడంతో అడ్డుకునేందుకు వెళ్లిన మల్లయ్యపై కర్రలతో దాడి చేశారు. మల్లయ్య తలకు తీవ్రగాయాలయ్యాయి. బాధితుడి ఫిర్యాదు మేరకు నరేష్, వెంకన్నపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ తెలిపారు.

ఇంట్లో దాచిన రూ.60 లక్షలు చోరీ

- బాధితుడి బంధువే నిందితుడు..?

బొమ్మలరామారం: ఇంట్లో దాచిన రూ.60 లక్షలు చోరీకి గురైన సంఘటన బొమ్మలరామారం మండలంలోని తిర్మలగిరి గ్రామంలో శుక్రవారం చోటుచేసుకుంది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. తిర్మలగిరి గ్రామానికి చెందిన ధరావత్ బిచ్చాలునాయక్ మూడు నెలల క్రితం తన భూమిని సుమారు కోటి రూపాయలకు విక్రయించాడు. అందులో తన కూతురు పెళ్లికి రూ.30లక్షలు ఖర్చు చేయగా, మిగతా డబ్బును సంచిలో పెట్టి ఇంట్లోనే సజ్జపై దాచాడు. కాగా గురువారం సాయంత్రం సజ్జపై ఉంచిన డబ్బుల సంచి కనబడకపోవడంతో బిచ్చాలునాయక్ వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చాడు. అయితే బిచ్చాలునాయక్ బంధువైన ఓ యువకుడు డబ్బుల సంచిని తీసుకెళ్లినట్లు చూశామని స్థానికులు పోలీసులుకు చెప్పారు. దీంతో పోలీసులు సదరు యువకుడిని పట్టుకొని విచారించగా నిజం ఒప్పుకున్నట్లు సమాచారం. నిందితుడి వద్ద రికవరీ చేసిన నగదుతో పాటు నిందితుడు పోలీసుల అదుపులో ఉన్నట్లు తెలిసింది.

హత్య కేసులో ఎనిమిది మందికి జీవిత ఖైదు

రాజాపేట: హత్య కేసులో ఒకే కుటుంబానికి చెందిన 8మందికి జీవిత ఖైదుతో పాటు జరిమానా విధిస్తూ భువనగిరి 1వ అదనపు జిల్లా జడ్జి మారుతీదేవి శుక్రవారం తీర్పు వెల్లడించినట్లు ఎస్‌ఐ సుధాకర్‌రెడ్డి తెలిపారు. ఎస్‌ఐ తెలిపిన వివరాల ప్రకారం.. రాజాపేట మండలంలోని చల్లూరు గ్రామంలో ఒకే కుటుంబానికి చెందిన చెట్కూరి అయిలయ్య, నర్సయ్య, కుమార్, యాదగిరి, స్వామి, అరుణ, లక్ష్మి(భర్త నర్సయ్య), లక్ష్మి(భర్త అయిలయ్య)కి అదే గ్రామంలో మరో కుటుంబానికి చెందిన చెట్కూరి అయిలయ్య మధ్య ఇంటి గోడ విషయంలో తగాదా చోటుచేసుకుది. ఈ నేపథ్యంలో 1 ఏప్రిల్, 2020న పైన పేర్కొన్న 8మంది కుటుంబ సభ్యులు కలిసి చెట్కూరి అయిలయ్యను హత్య చేశారని అప్పటి సీఐ నర్సయ్య కేసు నమోదు చేశారు. ఈ కేసు విచారణ అనంతరం శుక్రవారం భువనగిరి 1వ అదనపు జిల్లా జడ్జి ఎనిమిది మంది నిందితులకు జీవిత ఖైదుతో పాటు ఒక్కొక్కరికి రూ. 4500 చొప్పున జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించారు. జీవిత ఖైదు పడిన వారంతా ఒకే కుటుంబానికి చెందిన వారే కావడంతో వారి పిల్లలు శోకసంద్రంలో మునిగిపోయారు. వీరంతా గొర్లు కాసుకుంటూ కూలీ పని చేసుకుని జీవించేవారు. యాదగిరికి ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుమార్‌కు ఒక బాబు, పాప ఉన్నారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టిన ఇసుక ట్రాక్టర్


విరిగిన విద్యుత్ స్తంభం

నూతనకల్: ఇసుక ట్రాక్టర్ ఢీకొట్టడంతో విద్యుత్ స్తంభం విరిగిన ఘటన నూతనకల్ మండల పరిధిలోని బక్కహేమ్లాతండా గ్రామపంచాయతీ పరిధిలో శుక్రవారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. తండావాసులు తెలిపిన వివరాల ప్రకారం.. అర్వపల్లి మండలంలోని మూసీ నది నుంచి ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్ రోడ్డు వెంబడి ఉన్న 11కేవీ విద్యుత్‌స్తంభాన్ని ఢీకొట్టడంతో విద్యుత్ స్తంభం విరిగింది. విద్యుత్ వైర్లు పక్కనే ఉన్న చెట్ల కొమ్మలపై పడడంతో ఎలాంటి ప్రమాదం జరగలేదు. ఢీకొట్టిన ట్రాక్టర్ వెళ్లిపోవడంతో తండావాసులు రోడ్డు వెంబడి వెళ్లే మిగతా ఇసుక ట్రాక్టర్లను నిలిపి ప్రమాదానికి కారణమైన ట్రాక్టర్ సమాచారం ఇవ్వాలని వాగ్వాదానికి దిగారు. ట్రాక్టర్ యాజమానిపై చర్యలు తీసుకోవాలని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

పెట్రోల్ బంక్‌లో స్వైపింగ్ మోసం

రామగిరి(నల్లగొండ): పట్టణంలోని దేవరకొండ రోడ్డులో గల ఓ పెట్రోల్ బంక్‌లో వినియోగదారుల క్రెడిట్ కార్డు ద్వారా అధికంగా డబ్బులు స్వైపింగ్ చేసిన ఘటన శుక్రవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాలు.. నల్లగొండ పట్టణానికి చెందిన శిరీష మే 28న, నిమ్మల శ్రీనివాస్‌రెడ్డి జూన్ 15 తమ వాహనాల్లో రూ.1500 పెట్రోల్ పోయించుకున్నారు. క్రెడిట్ కార్డు ద్వారా పేమెంట్ చేసే క్రమంలో బంకులో పనిచేసే ఉద్యోగి మూడు సార్లు రూ.1500 చొప్పున కార్డును స్వైపింగ్ చేసి ఒక స్లిప్ ఇచ్చాడు. ఒక సారి మాత్రమే డబ్బులు కట్ అయ్యాయని అనుకొని వారు వెళ్లిపోయారు. కొన్ని రోజుల తర్వాత వారు బ్యాంక్ స్టేట్‌మెంట్ చూసుకోగా మూడు సార్లు డబ్బులు కట్ కావడంతో అవాక్కయ్యారు. శుక్రవారం బంక్ వద్దకు వచ్చి నిర్వాహకులను నిలదీశారు. దీంతో డబ్బులు తిరిగి ఇచ్చేశాడు. ఇలా ఎంత మంది వాహనదారుల వద్ద అధికంగా డబ్బులు స్వైపింగ్ చేశారనేది తెలియాల్సి ఉంది.

భూతగాదాలో వ్యక్తికి గాయాలు


గాయపడిన రావుల కిష్టయ్య

భూదాన్‌పోచంపల్లి: భూతగాదాలో ఒకరి తలకు గాయాలైన సంఘటన శుక్రవారం పోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని రేవనపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. వివరాలు.. రేవనపల్లి గ్రామానికి చెందిన రావుల కిష్టయ్యకు, అతడి సోదరుడికి మధ్య చాలా ఏళ్లుగా భూ వివాదం కొనసాగుతుంది. శుక్రవారం ఉదయం గ్రామంలో పెద్దమనుషుల సమక్షంలో భూ వివాదాన్ని పరిష్కరించుకునేందుకు సమావేశమయ్యారు. ఈ క్రమంలో కిష్టయ్యకు, అతడి సోదరుడు రావుల అయిలయ్య మధ్య వాగ్వాదాం జరిగింది. దీంతో కోపోద్రిక్తులైన రావుల అయిలయ్య కుమారులు యాదయ్య, రాజు, రమేష్ కలిసి రాయితో కిష్టయ్య తలపై కొట్టడంతో తీవ్ర రక్తస్రావమైంది. గాయపడిన కిష్టయ్యను చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ విక్రమ్‌రెడ్డి తెలిపారు.

లారీని ఢీకొట్టిన డీసీఎం.. వ్యక్తి దుర్మరణం

నల్లగొండ క్రైం: రోడ్డుపై ఆగి ఉన్న పాట్టు లారీని వెనుక నుంచి డీసీఎం ఢీకొట్టడంతో ఓ వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన నార్కట్‌పల్లి–అద్దంకి రహదారిపై నల్లగొండ పట్టణ పరిధిలోని పానగల్ బైపాస్ వద్ద గురువారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. నల్లగొండ టూటౌన్ ఎస్‌ఐ రాజశేఖర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. త్రిపురారం మండలంలోని కొనతాలపల్లి గ్రామానికి చెందిన అబ్బుమియా(65) మిర్యాలగూడలోని ఆర్‌ఎస్‌వీ రైస్ మిల్లు నుంచి డీసీఎంలో బియ్యం లోడుతో హైదరాబాద్‌కు వెళ్తున్నాడు. ఈ క్రమంలో పానగల్ బైపాస్ సమీపంలో హైదరాబాద్ వెళ్లే వైపు రోడ్డుపై ఆగి ఉన్న లారీని డీసీఎంతో వెనుక నుంచి ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో అబ్బుమియా అక్కడికక్కడే మృతిచెందాడు. శుక్రవారం మృతుడి కుమారుడు రఫీక్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

వలిగొండ: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందాడు. పోలీసులు, మృతుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. వలిగొండ మండలంలోని చిత్తాపురం గ్రామానికి చెందిన కందుల భిక్షమయ్య(70) మూడురోజుల క్రితం అదే గ్రామానికి చెందిన సలిగంజి వెంకటయ్యతో కలిసి టీవీఎస్ మోపెడ్‌పై గోపరాజుపల్లి గ్రామానికి వెళ్లి తిరిగి స్వగ్రామానికి వస్తున్నాడు. ఈ క్రమంలో గోపరాజుపల్లి గ్రామ శివారులోని దుర్గమ్మ గుడి సమీపంలోకి రాగానే మోపెడ్ అదుపుతప్పడంతో ఇద్దరూ రోడ్డుపై పడిపోయారు. ఈ ప్రమాదంలో భిక్షమయ్య తలకు తీవ్రగాయాలు కాగా, వెంకటయ్యకు స్వల్ప గాయాలయ్యాయి. భిక్షమయ్యను హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తుండగా శుక్రవారం ఉదయం మృతిచెందినట్లు కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. మృతుడి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ ప్రభాకర్ తెలిపారు.

పోలీస్ స్టేషన్‌లో పూజలు..!


కోదాడ పట్టణ సీఐగా రాము శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా త్రిశక్తి శాంభవి పీఠం అధిపతి, వేదపండితుడు విష్ణుబొట్ల హరిప్రసాద్ శర్మ పోలీస్ స్టేషన్‌లో ప్రత్యేక పూజలు నిర్వహించి, దుర్గామాత ఆశీస్సులు ఉండాలని సీఐని ఆశీర్వదించారు. - కోదాడ రూరల్

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య

గుర్రంపోడు: ఆర్థిక ఇబ్బందులతో పురుగుమందు తాగి ఆత్మహత్య చేసుకున్న వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందాడు. పోలీసుల వివరాల ప్రకారం.. కనగల్ మండలంలోని పగిడిమర్రి గ్రామానికి చెందిన గడగోటి అశోక్ (36) గుర్రంపోడు మండలంలోని చామలేడు గ్రామంలో ఉంటున్న తన చెల్లెలు ఇంటికి ఈ నెల 21న వచ్చాడు. అతడి తల్లి కూడా ఇక్కడే ఉండటంతో వారిద్దరితో తన ఆర్థిక ఇబ్బందులు చెప్పుకుని బాధపడ్డాడు. తర్వాత ఇంట్లోనే పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసుకున్నాడు. కుటుంబ సభ్యులు గమనించి నల్ల గొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం సాయంత్రం మృతిచెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు, తొమ్మిది నెలల వయస్సు బాబు ఉన్నాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అక్రమంగా తరలిస్తున్న ఆవుల పట్టివేత


డీసీఎంలో ఆవులు

భూదాన్‌పోచంపల్లి: అక్రమంగా తరలిస్తున్న ఆవులను శుక్రవారం తెల్లవారుజామున భూదాన్‌పోచంపల్లి మండలంలోని పిల్లాయిపల్లి గ్రామ శివారులో పోలీసులు పట్టుకున్నారు. సీఐ మహేష్, ఎస్‌ఐ విక్రమ్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని రాజ మండ్రితో పాటు తెలంగాణలోని మహబూబాబాద్‌లో 131 ఆవులు, కోడెలను కొనుగోలు చేసి రెండు డీసీఎంలు, బొలెరో వాహనంలో వాటిని హైదరాబాద్‌కు తరలిస్తుండగా పిల్లాయిపల్లి గ్రామ శివారులో వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు పట్టుకున్నారు. పట్టుబడ్డ ఆవులను హైదరాబాద్‌లోని గోశాలకు తరలించారు. వాహనాలను సీజ్ చేశారు. ఎనిమిది మందిపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

50 ఎద్దుల పట్టివేత..

బీబీనగర్: మండల పరిధిలోని బట్టుగూడెం గ్రామం గుండా హైదరాబాద్‌కు అక్రమంగా తరలిస్తున్న 50 ఎద్దులను బీబీనగర్ పోలీసులు శుక్రవారం తెల్లవారుజామున పట్టుకున్నారు. ఎస్‌ఐ యుగేంధర్ తెలిపిన వివరాల ప్రకారం.. ఒరిస్సా రాష్ట్రానికి చెందిన వ్యక్తులు బక్రీద్ పండుగ సందర్భంగా డీసీఎంలో 50ఎద్దులను గ్రామీణ ప్రాంతాల మీదుగా హైదరాబాద్‌కు తరలిస్తున్నట్లు సమాచారం రావడంతో బట్టుగూడెం గ్రామ పరిధిలో పోలీసులు వాహనాలను తనిఖీల్లో భాగంగా పట్టుకున్నారు. ఎద్దులను రాజాపేటలోని గోశాలకు తరలించగా అందులోని ఓ ఎద్దు ఊపిరాడక అప్పటికే మృతిచెందింది. ఈ మేరకు కేసు నమోదు చేసి డీసీఎంను, నిందితులను పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు. కాగా పరిమితికి మించి మూగజీవాలను వాహనాల్లో తరలిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదంటూ గూడూరు టోల్‌ప్లాజా వద్ద శుక్రవారం భజరంగ్‌దళ్ నాయకులు వాహనాలను ఆపి ఆందోళన చేపట్టారు. పోలీసులతో వాగ్వాదానికి దిగారు. దీంతో ఎస్‌ఐ యుగేంధర్ వెటర్నరీ వైద్యులను పిలిపించి మూగజీవాలను వాహనాల్లో తరలించే సంఖ్యా పరిమితిపై సర్టిఫికెట్లను జారీ చేసి వాహనాలను అక్కడి నుంచి పంపించారు.

సకల వసతులతో సర్కార్ బడి

- భీమనపల్లి పాఠశాలలో అధునాతన సౌకర్యాలు
- ప్రభుత్వ పాఠశాల వైపే ఆసక్తి చూపుతున్న విద్యార్థులు
- అభినందించిన ఉన్నతాధికారులు


ఆహ్లాదాన్ని పంచుతున్న పచ్చని పాఠశాల ఆవరణ


లాన్‌లో ఆడుకుంటున్న విద్యార్థినులు

భూదాన్‌పోచంపల్లి: సకల వసతులతో తీర్చిదిద్దిన సర్కార్ బడి పిల్లలకు ఆహ్లాదాన్ని పంచుతోంది. యాదాద్రి భువనగిరి జిల్లా భూదాన్ పోచంపల్లి మండలంలోని భీమనపల్లి గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాలను మన ఊరు–మన బడి కింద సుందరంగా తీర్చిదిద్దారు. గతంలో తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రైవేట్ పాఠశాలలకు పంపించేవారు. దాంతో మూడేళ్ల క్రితం విద్యార్థులు లేక పాఠశాల మూతపడేదశకు చేరుకొంది. గ్రామస్తులు, ఉపాధ్యాయులు తల్లిదండ్రులను చైతన్యం చేసి బడీడు పిల్లలను బడిలో చేర్పించి, తిరిగి బడిని నిలబెట్టారు. ప్రస్తుతం 70 మంది విద్యార్థులు చదువుకొంటున్నారు.

ప్రత్యేక ఆకర్షణగా పచ్చని లాన్..

మన ఊరు–మన బడి కింద రూ.7 లక్షల వ్యయంతో అధునాతన బెంచీలు, స్లాబ్‌పైన ఫ్లోరింగ్, అన్ని తరగతులకు కరెంట్ సౌకర్యం, తాగునీరు, రీడింగ్ రూమ్, వంట గది, బాలబాలికలకు వేర్వేరుగా మూత్రశాలలు నిర్మించారు. పాఠశాల భవనానికి రంగులు వేసి తీర్చిదిద్దారు. ఇదే పాఠశాలలో చదువుకొన్న పూర్వ విద్యార్థి, ప్రస్తుత వైస్ ఎంపీపీ పాక వెంకటేశ్ సొంతంగా సుమారు రూ.లక్ష ఖర్చుచేసి పాఠశాల ఆవరణలో పచ్చని లాన్ ఏర్పాటు చేశారు. దాంతో పాఠశాల కొత్త అందాలను సంతరించుకొంది. పచ్చని గార్డెన్ విద్యార్థులకు ఆహ్లాదాన్ని పంచుతోంది.


పాక వెంకటేశ్, దాత

ఉన్నతాధికారులచే ప్రశంసలు

ఇటీవల కేంద్ర ప్రభుత్వ విద్యాశాఖ జాయింట్ కమిషనర్ అమర్‌ప్రీత్ దుగ్గల్, రాష్ట విద్యాశాఖ కమిషనర్ వాకాటి కరుణ ఈ పాఠశాలను సందర్శించారు. పచ్చని లాన్, చెట్లతో పాఠశాలను తీర్చిదిద్దిన తీరును చూసి అభినందించారు. ఇదే మాదిరిగా అన్ని ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దితే బాగుంటుందని అభిప్రాయ పడ్డారు. అలాగే పచ్చని లాన్‌తో తీర్చిదిద్దిన పాఠశాల ఫొటోలను కేసీఆర్ చూసి అభినందించారని సమాచారం. కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా తీర్చిదిద్ది న పాఠశాల జిల్లాలోనే ఆదర్శంగా నిలవడం గమనార్హం.


విద్యార్థులు చేతులు కడుక్కోవడానికి ఏర్పాటు చేసిన నల్లాలు


తరగతి గదిలో ఏర్పాటు చేసిన డెస్క్ బెంచీలు

స్కూల్ బాగుంది



డెస్క్ బెంచీలు, బయట ఆడుకోవడానికి పచ్చని గార్డెన్, తాగడానికి మంచి నీళ్లు, అన్ని వసతులతో ఇప్పుడు స్కూల్ బాగుంది. చదువుకోవడానికి మంచి వాతావరణం ఉంది. గతంలో నేను పోచంపల్లిలోని ఓ ప్రైవేట్ స్కూల్‌లో చదువుకొనేది. 4వ తరగతి గవర్నమెంట్ స్కూల్‌లో చేరాను. పుస్తకాలు, యూనిఫామ్ ఇచ్చారు. - దీపిక, 7వ తరగతి

సుందరంగా తీర్చిదిద్దాం



మొదటి విడత మన ఊరు–మన బడి కింద మాస్కూల్ ఎంపికై ంది. దాంతో రూ.7లక్షల వ్యయంతో పాఠశాలను సకల సౌకర్యాలతో సుందరంగా తీర్చిదిద్దాం. దాంతో ఇప్పుడు తల్లిదండ్రులు పిల్లలను ఇదే స్కూల్‌కు పంపిస్తున్నారు. తరగతి గదుల్లో అధునాతనమైన బండలు వేయడానికి రూ.4 లక్షలు మంజూరు చేయాలని కోరుతున్నాం. ఇటీవల ఉన్నతాధికారుల దృష్టికి కూడా తీసుకెళ్లాం. - కంటి రాములుయాదవ్, సర్పంచ్, భీమనపల్లి

అధునాతన వసతులు



మన ఊరు–మన బడి కింద పాఠశాలలో అధునాతన వసతులు కల్పించబడ్డాయి. పిల్ల లు చదువుకోవడానికి మంచి వాతావరణం ఏర్పడింది. కరోనా తరువాత బడిలో ఒక్కసారిగా పిల్లలు తగ్గిపోయారు. దాంతో గ్రామస్తులు, సర్పంచ్ సహకారంతో పిల్లలను బడిలో చేర్పిస్తున్నాం. ప్రస్తుతం 70 వరకు పిల్లలు ఉన్నారు. మరింత పెరిగే అవకాశం ఉందని భావిస్తున్నాం. - నర్సింహ, ప్రధానోపాధ్యాయుడు